ఈనాడు

Date: 10/01/23




ఇంటింటికీ ఇంటర్‌నెట్

# ఈ ఏడాదే

- ఈ సంవత్సరమే టీఫైబర్ ద్వారా పది లక్షల ఇళ్లకు సౌకర్యం
- ఉద్యోగాల కల్పనలో తెలంగాణే మేటి
- హైసియా సమావేశంలో మంత్రి కేటీ రామారావు

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో టీఫైబర్ ద్వారా ఈ ఏడాది ఇంటింటికీ ఇంటర్నెట్‌ను అందిస్తామని, పది లక్షల ఇళ్లకు సౌకర్యం కలుగుతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీ రామారావు తెలిపారు. ఐటీ రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతితో పురోగమిస్తోందన్నారు. ఐటీ రంగంలో వచ్చిన ఉద్యోగాల సంఖ్యలో బెంగళూరును హైదరాబాద్ దాటడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. ఐటీలో గత రెండేళ్లలో కొత్తగా 40 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇప్పటికే కార్యాలయ స్థల వినియోగంలో బెంగళూరును దాటామన్నారు. దేశంలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల్లో 20% హైదరాబాద్ నుంచే పనిచేస్తున్నారని వెల్లడించారు. త్వరలో దేశంలోనే అతిపెద్ద ప్రోటో టైప్ సెంటర్ టీవర్క్స్‌ను ప్రారంభిస్తామన్నారు. హైదరాబాద్ ఐటీ సాఫ్ట్‌వేర్ పారిశ్రామికవేత్తల సంఘం (హైసియా) హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని థ్రిల్‌సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన ఐటీ పారిశ్రామికవేత్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ...మిగతా 2లో

# ఇంటింటికీ ఇంటర్‌నెట్ ఈ ఏడాదే

(మొదటి పేజీ తరువాయి)




హైసియా సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్. వేదికపై మనీషా, జయేశ్‌రంజన్, సీపీలు ఆనంద్, చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర, మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి.

"సాంకేతిక పరిజ్ఞానం సమాజ హితం కోసమే పనిచేయాలని సీఎం దిశానిర్దేశం మేరకు తెలంగాణ పయనిస్తోంది. పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పాటు, శాంతిభద్రతల బలోపేతం, పర్యావరణ ఆవిష్కరణలకు ప్రోత్సాహం వంటి చర్యలు చేపట్టాం. సుస్థిర ప్రభుత్వం ఉండటం అభివృద్ధికి ఊతమిచ్చింది. 2014లో ఐటీ ఉద్యోగులు 3.23 లక్షల మంది కాగా.. ప్రస్తుతం 8.7 లక్షల మంది ఉన్నారు. పెట్టుబడులు రూ.57 వేల కోట్ల నుంచి రూ.183 లక్షల కోట్లకు పెరిగాయి. టీఫైబర్ ఈ ఏడాది కార్యరూపం దాలుస్తుంది. ఇంటర్నెట్ సేవలు గ్రామాలకు, మారుమూల ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. హైదరాబాద్‌లో ఉన్న 3000కు పైగా హాట్‌స్పాట్‌ల ద్వారా అందిస్తున్న వైఫై విజయవంతమైంది. పెన్షన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల రెన్యూవల్, ఈఓటింగ్ వంటి అనేక ప్రభుత్వ సేవలలో పెద్ద ఎత్తున నవీన సాంకేతికతను వినియోగిస్తున్నాం. హైదరాబాద్‌లో మౌలిక వసతులతో పాటు సామాజిక సదుపాయాలను కల్పిస్తున్నాం. ఇప్పటికే ఎస్ఆర్‌డీపీ ద్వారా అనేక ప్రాజెక్టులను పూర్తిచేశాం. త్వరలోనే సంపూర్ణ మురుగునీటి శుద్ధి జరుగుతుంది. 2050 వరకు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సరిపడా వనరులున్నాయి. త్వరలో విమానాశ్రయ మెట్రో వంటి మరిన్ని ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేయనున్నాం. 300 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ మాదిరే ఐటీ పరిశ్రమను రాష్ట్రమంతటికీ విస్తరిస్తున్నాం. జిల్లా కేంద్రాల్లో ఐటీ పరిశ్రమకు అవసరమైన సౌకర్యాలు కల్పించాం. పలు జిల్లాకేంద్రాల్లో ఐటీ టవర్లను ఏర్పాటు చేశాం. పరిశ్రమలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలి. తెలంగాణలోని బాసర ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థల విద్యార్థులతో ఐటీ కంపెనీలు పని చేయాలి" అని కేటీఆర్ కోరారు.

### ఐటీ మంత్రిగా కేటీఆర్ ఉండటం గర్వకారణం

తెలంగాణ ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉండటం ఐటీ పరిశ్రమలకు వరంగా మారిందని హైసియా అధ్యక్షురాలు మనీషా సాబు ప్రశంసించారు. ప్రభుత్వ విధానం కారణంగా దేశంలోనే అత్యుత్తమంగా హైదరాబాద్ ఐటీ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. పెట్టుబడులకు హైదరాబాద్ చాలా అనుకూలమైన ప్రాంతమని ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. సమావేశంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలు సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర, డీఎస్ చౌహాన్, హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ముఖ్య సంబంధాల అధికారి అమర్‌నాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు.